క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడికి స్వాగతం

నకిరేకల్ : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు వెలుతున్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అడ్లూరు లక్ష్మణ్ శనివారం నకిరేకల్‌లోని బైపాస్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా మంత్రులకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, బ్రహ్మదేవర రమేష్, గాదగోని కోండయ్య, నకిరేకంటి నరేందర్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

గట్టుప్పల్ : ఈనెల 6న హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గట్టుప్పల్, తేరట్‌పల్లి, నామాపురం, వెల్మకన్నె గ్రామాల్లోని రైతులకు చెందిన కొన్ని వందల ఎకరాల పట్టా భూములు ట్రిపుల్ ఆర్ విస్తరణలో కోల్పోతున్నారని అన్నారు. వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, పెద్దగాని నరసింహ, ఖమ్మం రాములమ్మ, విశ్వనాథం పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైన రాకేష్‌కు సన్మానం



రాకేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చండూరు : గ్రూప్–1 ఫలితాల్లో మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైన పాల్వాయి రాకేష్‌ను చండూరులోని ఆయన చదివిన గీతా విద్యాలయం సిబ్బంది శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలోజు నర్సింహాచారి సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం గొప్ప విషయం

కనగల్: నేత్రాలు దానం చేయడం చాలా గొప్ప విషయమని నల్లగొండ లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. కనగల్ మండలంలోని బాలసాయి గూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏమిరెడ్డి సైదిరెడ్డి తండ్రి ఏమిరెడ్డి చెన్నారెడ్డి (85) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు నల్లగొండ లయన్స్ క్లబ్ వారికి దానం చేశారు. ఈ సందర్భంగా నేత్రాలు స్వీకరించిన క్లబ్ సభ్యులు మాట్లాడారు. దానం చేసిన ఐ కార్నియాలతో ఇద్దరు అంధులకు కంటిచూపు తేవచ్చన్నారు. మృతుడు చెన్నారెడ్డి నేత్రాలను దానం చేసిన ఆయన కుమారుడు సైదిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నిమ్మల పిచ్చయ్య, ఎర్రమాద అశోక్, వేముల సాయికుమార్, మందడి శంకర్‌రెడ్డి, జానీ, బోధనం సుధాకర్ రెడ్డి, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అశ్వనిని సన్మానిస్తున్న ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నల్లగొండ: కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ దీక్షాంత్ సమారోహ (నైపుణ్య స్నాతకోత్సవ వేడుక 2025)లో సీటీఎస్ మెయిన్స్–2025 పరీక్షల్లో ట్రేడ్‌వైజ్ టాపర్‌గా నిలిచిన నల్లగొండ ఐటీఐ కళాశాలకు చెందిన ఆడెపు అశ్విని ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమెను ఐటీఐ కాలేజి ప్రిన్సిపల్ నర్సింహాచారి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అశ్వనితల్లి నర్సమ్మ, సురేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆ కుటుంబాలకు టికెట్లు ఇవ్వొద్దు

మిర్యాలగూడ టౌన్ : ప్రజా ప్రతినిధులు పదవీ కాలం మధ్యలో చనిపోతే వారి కుటుంబ సభ్యులకు టికెట్లు ఇవ్వొద్దని మిర్యాలగూడ మండలం అలగడప మాజీ సర్పంచ్, తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం అలగడప వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సుమిత్రబాయికి నివాళి

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ సతీమణి సుమిత్ర బాయి అంత్యక్రియలు శనివారం ముగిసాయి. ఆమె అంత్యక్రియల్లో పలువురు రాజకీయ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు చెరుపల్లి సీతారాములు, అలుగుబెల్లి నర్సిరెడ్డి, మల్లు లక్ష్మీ, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్, హాసం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- నల్లగొండ మండలానికి 650 మంజూరు
- వివిధ దశల్లో 600 ఇళ్లు
- 455 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- దీపావళికి గృహ ప్రవేశాలు జరిగే అవకాశం



పెద్ద సూరారంలో స్లాబ్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

రామగిరి(నల్లగొండ): పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నల్ల గొండ మండలానికి 650 ఇళ్లు మంజూరు చేసింది. 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోంది. ఇందులో ఇప్పటికే 600 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

నిత్యం పర్యవేక్షణ

నిర్మాణంలో ఉన్న ఇళ్లలో కొన్ని గోడల స్థాయి వరకు, మరికొన్ని స్లాబ్ వరకు పూర్తయినవి ఉన్నాయి. ఇప్పటివరకు 455 మందికి రూ.లక్ష చొప్పున, రూ.2 లక్షల చొప్పున 172 మందికి, రూ.4 లక్షలు 89 మంది లబ్ధిదారులకు వారివారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నుంచి జమయ్యాయి. పంచాయతీ అధికారులు, హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా, పనులకు ఆటంకం కలగకుండా ఇంటి నిర్మాణ దశను గుర్తించి వారి ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చొరవ తీసుకుంటున్నారు. దీపావళి పండుగ నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా శరవేగంగా పనులు చేయిస్తున్నాం.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఇటీవల ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. వెంటనే నిర్మాణ పనులు చేపట్టాం. ఇప్పటివరకు రూ.4 లక్షలు మా బ్యాంకు ఖాతాలో పడ్డాయి. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– నిమ్మనగోటి అందాలు, పెద్ద సూరారం

రోజూ పర్యవేక్షిస్తున్నాం



అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను రోజూ పర్యవేక్షిస్తున్నాం. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు త్వరగా జమ చేస్తున్నాం. దీపావళి వరకు గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.యాకుబ్‌నాయక్, ఎంపీడీఓ, నల్లగొండ

అన్ని స్థానాలు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలి



మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నీ గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో భూపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దీన్ని ఎన్నికల్లో ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలను వాయిదా వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కటికం సత్తయ్య గౌడ్, వంగాల సహదేవరెడ్డి, కరీం పాషా, గోనా రవీందర్‌రావు, అయితగోని యాదయ్య, రామగిరి శ్రీధర్ రావు, జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి, కడారి కృష్ణయ్య పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు

రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ఘన నివాళి



దామోదర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోయిందని డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. శాలిగౌరారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడ దానయ్య, పెరుమాండ్ల నరేశ్, కడారి అంజయ్య, కంది మహేశ్, మంగదుడ్ల శ్రీను, సైదులు, ఇబ్రహీం, కృష్ణయ్య, వెంకన్న, రమేశ్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

- మనిమద్దె వద్ద రోడ్డుపై భారీ రంధ్రం, గుంతలు
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం
- వెంటనే పూడ్చాలని వేడుకోలు

శాలిగౌరారం: మండలంలోని గురుజాల – అమ్మనబోలు ప్రధాన రోడ్డుపై మనిమద్దె క్రాస్‌రోడ్డు సమీపంలో ఓ పెట్రోల్‌బంక్ వద్ద కల్వర్టుపై ఏర్పడిన భారీ రంధ్రంతోపాటు గుంతలు ప్రమాదకరంగా మారాయి. శాలిగౌరారం మండలం నుంచి మోత్కూరుకు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన మార్గం కావడం, ఇది సింగిల్ రోడ్డు కావడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు దగ్గరకు వచ్చేవరకు రోడ్డుపై పడిన గుంత కనిపించకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇక రాత్రి వేళలో కొత్తవారు ఈ రోడ్డుపై ప్రయాణిస్తే అంతే సంగతులు. దీన్ని గమనించిన స్థానికులు రోడ్డుపై ఏర్పడిన రంధ్రంలో హెచ్చరిక కోసం చెట్టు కొమ్మలను పెట్టారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై ఏర్పడిన భారీ రంధ్రంతోపాటు పెద్ద గుంతలను పూడ్చి తాము ప్రమాదాల బారిన పడకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



గురుజాల - అమ్మనబోలు రోడ్డుపై మనిమద్దె సమీపంలో ఏర్పడిన రంధ్రం, గుంతలు (ఇన్‌సెట్లో హెచ్చరిక కోసం పెట్టిన కొమ్మలు)

పుష్కర కాలమైనా పూర్తికాలే..

- మునుగోడులో అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం
- 2013లో పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని భవన నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న స్త్రీ శక్తి భవన నిర్మాణం

మునుగోడు: మునుగోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పన్నెండేళ్ల క్రితం (2013వ సంవత్సరంలో) మొదలుపెట్టిన స్త్రీ శక్తి భవన నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయింది. మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఒక స్త్రీశక్తి భవన నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మునుగోడుకు ఒక భవనం మంజూరు చేసి ఉపాధిహామీ నిధుల నుంచి రూ.25 లక్షల నిధులు కేటాయించింది. దీంతో 2013లో అప్పటి మునుగోడు ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఆ పనులు గత ఏడాది క్రితం వరకు పనులు చేపట్టగా దాదాపు 80 పూర్తయ్యాయి. కానీ మిగిలిన పనులు నేటికీ పూర్తికాపోవడంతో ఆ భవనం ప్రారంభానికి ముందే శిథిలమయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వరికోతలకు ముందే కల్లాల కోసం పరుగులు



శాలిగౌరారం మార్కెట్‌యార్డులో ధాన్యం పోసుకునేందుకు కవర్లు పరిచి స్థలాలు ఆపుకున్న రైతులు

శాలిగౌరారం: మండలంలో వానాకాలం సీజన్ వరికోతలు ప్రారంభమయ్యాయి. రైతులు ధాన్యం అమ్మకంలో భాగంగా ముందస్తుగా ఆరబోసుకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు ఆపుకునేందుకు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో శాలిగౌరారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో కొందరు రైతులు ఇలా కవర్లు కప్పి స్థలాలు ఆపుకుంటున్నారు. ఇదిలా ఉంటే మార్కెట్ యార్డులో ముందస్తుగా పరుచుకున్న కవర్లను(పట్టాలను) తొలగించి ధాన్యం తీసుకొచ్చిన వారికే రాసులు పోసుకునేందుకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



రామగిరి : బోయవాడలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



నకిరేకల్ : నోములలో పూజలు చేస్తున్న స్టార్ యూత్ సభ్యులు



కేతేపల్లి : దుర్గాదేవి శోభాయాత్రలో కోలాట ప్రదర్శన



రామగిరి: బోయవాడలో భవాని మాలధారులకు జలాభిషేకం చేస్తున్న భక్తులు



నకిరేకల్ : శోభాయాత్రలో పాల్గొన్న కనకదుర్గ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

రామగిరి (నల్లగొండ): దేవీశరన్నవరారాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శనివారం బోయవాడలో దుర్గామాత అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. అలాగే నల్లగొండలోని పాతబస్తీ, రామగిరి, దేవరకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు తదితర ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి వల్లభరావు చెరువులో నిమజ్జనం చేశారు.

నకిరేకల్ : నకిరేకల్‌లోని కనకదుర్గ ఆలయం ముందు ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారి శోభాయాత్ర శనివారం రాత్రి మహిళల చిడతల భజనలు, కోలాట ప్రదర్శనలు, డప్పు చప్పుళ్లతో నడుమ కోలాహలంగా కొనసాగింది. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కందాల సత్తిరెడ్డి, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నోముల గ్రామంలో స్టార్ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం దుర్గాదేవి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. అనంతరం తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గాదేవి విగ్రహాలను గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు.

జాతీయ రహదారి వెంట చెత్త కుప్పలు



కేతేపల్లిలో రోడ్డు పక్కన పడేసిన చెత్త

కేతేపల్లి: కేతేపల్లి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారిలో ఎస్సీ కాలనీ వద్ద జాతీయ రహదారి వెంట చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇల్లలోని చెత్త, దుకాణాల్లో వ్యర్థాలను తెచ్చి జాతీయ రహదారి పక్కనే పడేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. వీటి నుంచి వచ్చే దుర్గంధం వల్ల రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు చెత్త నుంచి మరింత దుర్వాసన వస్తుందని, మామూలు సమయాల్లో గాలి వీచినప్పుడు దుమ్ము, చెత్త లేచి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట పారబోసిన చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సగర సంఘం నూతన కమిటీ ఎన్నిక

నాంపల్లి: నాంపల్లి మండలం కుందేళ్ల తిరుమలగిరి గ్రామంలో సగర సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నేర్లకంటి భిక్షమయ్య, ప్రధాన కార్యదర్శిగా గంట నాగయ్య, కోశాధికారిగా గంట నాగరాజుతోపాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నేర్లకంటి రవికుమార్, ప్రధాన కార్యదర్శి బలుగురి కరుణాకర్, కల్లెట్ల రమేష్ ;పెండెం వెంకటేష్, నేర్లకంటి శివశంకర్, పెండెం ఈదయ్య, రామలింగం, శ్రీను, వెంకటయ్య, కల్లెట్ల యాదయ్య, గంట రోహిత్ పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్లు

- స్తంభాలకు అల్లుకున్న తీగ బంధం
- తొలగించని యంత్రాంగం
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఇబ్బందుల్లో అంబారిపేట గ్రామస్తులు



అంబారిపేటలో బొడ్రాయి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగజాతి చెట్లు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్లు

శాలిగౌరారం: మండలంలోని అంబారిపేట గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగజాతి చెట్లు అల్లుకోవడంతోపాటు చుట్టూ కంపచెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న 100 హెచ్‌పీ డీపీ(డబుల్‌పోల్) ట్రాన్స్‌ర్మర్‌తోపాటు ఏబీ స్విచ్(ఆన్ ఆఫ్ స్విచ్)ను, విద్యుత్ స్తంభాలను కొన్ని తీగజాతి మొక్కలు పూర్తిగా అల్లుకుపోవడంతో పాటు కంపచెట్ల కొమ్మలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ కొట్టివేస్తుంది. బొడ్రాయి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో గ్రామానికి తాగునీటిని అందించే ఐదు పంచాయతీ బోర్లతో పాటు మరో 10 వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. అదేవిధంగా గ్రామంలోని నివాసాలకు, వీధిలైట్లకు విద్యుత్ సరఫరా కూడా ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారానే జరుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపచెట్లు, తీగజాతి మొక్కలు అల్లుకుపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగడం వల్ల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొక తప్పడంలేదు. విద్యుత్ అంతరాయంతో తాగునీటి కోసం అటు ప్రజలు, సాగునీటి కోసం ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మరికొన్ని చోట్ల చిన్న టాన్స్‌ఫార్మర్ల పరిస్థితి కూడా ఇలాగే ఉందని ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్ ప్రమాదాల బారిన మూగజీవులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకున్న తీగజాతి మొక్కలకు ఏర్పడిన పూలు, కాయలను తినేందుకు అటు కోతులు, ఇటు పచ్చిగడ్డి కోసం పశువులు వెళుతూ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన కంపచెట్లను తొలగించి ప్రమాదాలు జరుగకుండా నివారించడంతోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మేతకోసం వెళ్లి పాడిగేదె మృతిచెందింది



గ్రామంలోని బొడ్రాయి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు, తీగజాతి మొక్కలు పెరిగాయి. దీంతో ఇటీవల రూ.60 వేల విలువైన మా పాడిగేదె మేత కోసం ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెట్లు పెరగకుండా చూడాలి.

– లింగాల శేఖర్, రైతు, అంబారిపేట

ప్రమాదాలను నివారించాలి



కంపచెట్లు, తీగజాతి మొక్కలు అల్లుకుపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించకుండా పోయాయి. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాలి.

– చలకాని మల్లయ్య, అంబారిపేట